# సాక్షి తిరుపతి

శుక్రవారం । 29 । మార్చి । 2024

I




## వజ్రాయుధం..వదులుకోవద్దు

ఓటు హక్కును తప్పక వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని జిల్లా ఎన్నికల అధికారి లక్ష్మీశ పిలుపునిచ్చారు. - IIలో



## దివ్యాంగులకు హామిల్టన్ చేయూత

శ్రీసిటీలోని హామిల్టన్ కంపెనీ రూ.15 లక్షల విలువైన పరికరాలను దివ్యాంగులకు ఉచితంగా అందజేసింది. - IIలో

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శుక్రవారం (సా) | సహర్ శనివారం (ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6-27 | 4-52 |
| గూడూరు | 6-22 | 4-47 |

## న్యూస్‌రీల్

### 4న టీసీఎల్ ఉద్యోగ మేళా

**తిరుపతి సిటీ:** నగరంలోని న్యూ బాలాజీ కాలనీ ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో వచ్చేనెల 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఏ.ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోనే పేరొందిన టీసీఎల్ కంపెనీ ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. బీఏ, బీకాం, బీబీఐ, బీబీఏ, బీబీఎం, బీఎంఎస్, బీఎస్సీ పూర్తి చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు https:// nextstep. tcs. com/ campus/#/అనే లింకు ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఆమె సూచించారు.

### 4 నుంచి అన్నమయ్య వర్ధంతి

**తిరుపతి కల్చరల్:** తాళ్లపాక అన్నమయ్య 521వ వర్ధంతి వేడుకలు ఏప్రిల్ 4 నుంచి 8వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో ఘనంగా జరుగనున్నాయి. అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద, తిరుమల నారాయణగిరి ఉద్యానవనం, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 4వ తేదీ ఉదయం 6 గంటలకు తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 5న సాయంత్రం 6గంటలకు తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం చేపడతారు. 5 నుంచి 8వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు తిరుపతి అన్నమాచార్య కళామందిరం, తాళ్లపాకలోని ధ్యాన మందిరం, 108 అడుగల అన్నమయ్య విగ్రహం వద్ద సాయంత్రం ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### రమ్మన్నారు... అవమానించారు



బొజ్జల సుధీర్‌రెడ్డి కారు ముందు పడుకుని నిరసన తెలియజేస్తున్న విలేకరి

**శ్రీకాళహస్తి:** జనసేన నేత ఇంటికి వద్దకు రమ్మని విలేకరులను ఆహ్వానించి టీడీపీ శ్రీకాళహస్తి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అవమానించారు. గురువారం జరిగిన ఈ సంఘటనను ప్రజాస్వామ్య వాదులంతా తీవ్రంగా ఖండించారు. సుధీర్ పిలుపుమేరకు విలేకరులు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడ సుధీర్‌రెడ్డితో పాటువిలేకరులు ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వినుత అడ్డుకున్నారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విలేకరులను వెంట బెట్టుకుని రావడమేమిటని సుధీర్‌ను ప్రశ్నించారు. ఎవరూ లోపలికి రావద్దు, బయటే ఉండాలి చెప్పడంతో సుధీర్‌రెడ్డి, విలేకరులు అర గంటపైగా బయటే ఉన్నారు. ఇంతలో విలేకరుల సమావేశం లేదని సుధీర్‌రెడ్డి ప్లేట్ ఫిరాయించారు. దీనిపై విలేకరులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. తమను పిలవడం ఎందుకు, అవమానించడం ఎందుకని ప్రభాత దర్శిని విలేకరి వెంకటేశ్వర్లు వినుత ఇంటి వద్ద సుధీర్‌రెడ్డి కారు ముందు పడుకుని నిరసన తెలిపాడు. నిన్నటి వరకు తనను విమర్శించిన వినుత ఇంటికి సుధీర్ రావడం ఎదో పెద్దవార్త ఉంటుందని విలేకరులు అనుకున్నారు. అయితే సుధీర్‌రెడ్డిని వినుత దంపతులు సాదరంగా ఆహ్వానించలేదు. విలేకరుల సమావేశం ఉందని ముందుగా చెప్పాలి కదా, ఇది సరైన పద్ధతి కాదని వినుత వాదించడం చర్చనీయాంశమైంది.

### నమో నారసింహా..



బంగారు గరుడ వాహనంపై విహరిస్తున్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామి

**రాపూరు:** ప్రసిద్ధ పెంచలకోన క్షేత్రంలో గురువారం పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారు బంగారు గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా ఉదయం విశేష అభిషేక పూజలు చేసి చందనంతో అలంకరించారు. అనంతరం నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం నిర్వహించారు. తదుపరి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి సర్వాంలంకార భూషితుడైన శ్రీస్వామివారు బంగారు గరుడ వాహనంపై కొలువుదీరి తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి తరించారు. కోనలో గోవింద నామస్మరణ మిన్నంటింది.

# కార్మికుల బతుకుల్లో కాంతులు

దశాబ్దకాలంగా కార్మికులకు వేతనాల పెండింగ్ గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. పెండింగ్ వేతనాల చెల్లింపుపై ముఖం చాటేసింది. ఏకంగా ఫ్యాక్టరీనే మూత వేయించి చేతులు దులుపుకుంది. ఫలితంగా కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం పదేళ్ల నాటి పెండింగ్ వేతనాలను ఒకేసారి చెల్లించింది. దీంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. మనోధైర్యంతో కార్మికుల కుటుంబాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. ప్రభుత్వం అందించిన తోడ్పాటుపై కార్మికలోకం నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

- దశాబ్దం క్రితం నాటి వేతనాలు చెల్లించిన ప్రస్తుత ప్రభుత్వం
- షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలకు చెక్
- వేతనాలడిగితే ఫ్యాక్టరీని మూసేసిన గత పాలకులు

**చిత్తూరు అగ్రికల్చర్:** చిత్తూరు సహకార చక్కెర కర్మాగారానికి ఏళ్ల తరబడి ఆదరణ లేక కునారిల్లిపోయింది. గత పాలకుల తీరుతో ఫ్యాక్టరీ మూతపడడమే కాకుండా, కార్మికులకు అందాల్సిన వేతనాలు కూడా చెల్లించకుండా ముఖం చాటేశారు. నాలుగు దశాబ్దాల పాటు చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి పథంలో నడిచింది. చిత్తూరుకు సమీపంలోని 10 మండలాల పరిధిలోని దాదాపు 16 వేల మంది చెరుకు రైతులకు అండగా నిలిచింది. అలాంటి ఫ్యాక్టరీని గత ప్రభుత్వ హయాంలో 2015 జనవరిలో ఉద్దేశ పూర్వకంగానే నష్టాలు చూపి మూతపడేలా చేసింది. ఫ్యాక్టరీని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికుల వేతనాలను సైతం చెల్లించకుండా మిన్నకుండి పోయింది. కార్మికులు తమ గోడును వెల్లబోసుకున్నా అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో పెండింగ్ వేతనాలపై ఆశలు వదులుకున్న కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి.

**ప్రస్తుతం కార్మికుల జీవితాల్లో వెలుగులు**

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిన వేతనాలు అందుతాయో లేదో తెలియని మీమాంసలో కార్మికుల కుటుంబాలు కొట్టుమిట్టాడాయి. ఇలాంటి తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచింది. గత ఏడాది జూలైలో కార్మికులందరికీ వేతనాలు చెల్లించింది. దాదాపు పదేళ్లపాటు వంద మంది పర్మనెంట్ కార్మికులు, 450 మంది సీజనల్ కార్మికులకు పెండింగ్‌లో ఉండిన రూ.31.22 కోట్ల వేతనాలను ఒక్కసారిగా చెల్లించింది. దీంతో ప్రతి కార్మికునికి రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు పెండింగ్ వేతనాలు చేతికందాయి. ఫలితంగా ఏళ్ల తరబడి దుర్భర జీవితాలను అనుభవిస్తున్న కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. అప్పుల ఊబిలో నుంచి బయటపడడమే కాకుండా, వారి పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కొత్త ఇళ్ల నిర్మాణం లాంటి చర్యలతో ఆనంద జీవనంలో పడ్డారు.

**ఆనందంగా జీవిస్తున్నాం**



పెండింగ్ వేతనాలు అందడంతో ఆనందంగా జీవిస్తున్నాం. ఫ్యాక్టరీని నమ్ముకుని 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాం. 2015లో మూతపడడం, వేతనాలు చేతికందక పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించడంతో రూ.34 లక్షలు చేతికందింది. దీంతో మాకున్న అప్పులు తీర్చుకోగా, మా అమ్మాయికి పెళ్లి చేసి, ఇల్లు కట్టుకుని, చిన్న దుకాణం పెట్టుకుని ఎలాంటి చీకూ చింత లేకుండా జీవనం సాగిస్తున్నాం.

– మహ్మద్‌గౌస్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

**మా అబ్బాయిని డాక్టర్ చదివించుకున్నాం**



గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉండిన వేతనాలను ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కసారిగా చెల్లించింది. దీంతో నాకు రూ.29 లక్షలు చేతికందాయి. ఈ డబ్బులను మా అబ్బాయి వెటర్నరీ డాక్టర్ కోర్సుకు చేసిన అప్పులు కూడా చెల్లించుకున్నాం. ప్రస్తుతం మా అబ్బాయి డాక్టర్ విద్యను పూర్తి చేసి సంచార పశువైద్య అంబులెన్స్‌లో డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కార్మికుల కష్టాలు తెలుసుకుని పెండింగ్ వేతనాలను ప్రభుత్వం ఒక్కసారిగా చెల్లించడం మా అదృష్టం.

– ఇ.ఎస్.వెంకటప్రసాద్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

**అప్పులు తీర్చుకుని, ఇల్లు కట్టుకున్నాం**



పెండింగ్ వేతనాలపై ఆశలు వదులుకున్నాం. అప్పుల పాలయ్యాం. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం కార్మికులను ఆదుకుంది. ఒకే దఫాలోనే వేతనం మొత్తం చెల్లించడంతో నాకు రూ.18 లక్షలు చేతికందింది. దీంతో చేసిన అప్పులను చెల్లించడమే కాకుండా, సొంత ఇల్లు కూడా నిర్మించుకున్నాం. ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీలోనే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఈ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది.

– జీఎస్.భాస్కర్, సెక్యూరిటీ గార్డు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

**ఆటో కొనుక్కున్నా**



నాకు ఒక్క సారిగా పెండింగ్ వేతనం కింద రూ. 20 లక్షల వరకు చేతికందింది. ఈ డబ్బులను మా అబ్బాయి బి టెక్ చదువుకు ఫీజులు చెల్లించి, కొంత మేరకు అప్పులు చెల్లించి, ఇల్లు నిర్మించుకున్నాం..ఆటో కొనుక్కుని దానిద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా.. వేతనాలు చేతికందక పోవడంతో ఏళ్ల తరబడి చాలా ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన తోడ్పాటు ఎప్పటికి మరచిపోలేం.

–పి.కుమార్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

**కష్టకాలంలో ఆదుకున్నారు**



ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి కష్టకాలంలో ఆదుకున్నారు. నాకు రూ.30 లక్షలు చేతి కందింది. దీంతో తాము గతంలో బ్యాంకుల్లో, ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసిన అప్పులు చెల్లించుకున్నాం. మిగిలిన డబ్బులతో లెదర్ బ్యాగులు కుట్టే మిషన్ కొనుక్కుని దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో తమ కుటుంబం ఆనందంగా జీవిస్తున్నాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఏ.రాజశేఖర్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

# ఎర్ర మాఫియా



- అడ్డూ అదుపులేని వామపక్షాల భూఆక్రమణలు
- రేణిగుంట మండలంలో విలువైన ఆస్తులపై కన్ను
- సామాన్యులకు ఇంటిస్థలాలు ఆశ చూపి కరకంబాడిలో ముప్పు తిప్పలు
- తారకరామానగర్‌లోనూ అడ్డూ అదుపులేని కబ్జాలు
- తూకివాకంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణం
- సొంతస్థలాలు కూడబెట్టుకుంటున్న వామపక్ష నాయకులు

పేదల పక్షాన నిలిచి పోరాట స్ఫూర్తితో హక్కులను సాధించే సంకల్పంతో పనిచేయాల్సిన వామపక్ష నాయకులు సొంత ఎజెండానే ధ్యేయంగా భూదందాలు చేస్తున్నారు. కొందరు నాయకులు పేదల మాటున సొంత ఆస్తులను కూడబెట్టుకుంటూ ఉద్యమాన్ని వినియోగించుకుంటుండడంతో సామాన్య ప్రజలు విస్తుపోతున్నారు. రెండు రోజుల కిందట రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ప్రజలు వామపక్ష నాయకులపై తిరగబడడంతోపాటు పేదల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తూ ప్రభుత్వ స్థలాల్లో బలవంతంగా ఇళ్లు కట్టిస్తున్నారని నిలదీయడం చర్చనీయాంశమైంది.' వివాదాస్పద స్థలాల ఆక్రమణే టార్గెట్‌గా వామపక్ష నాయకులు 'కంచె వేసెయ్..కబ్జా చేసెయ్' అన్న తీరుగా చేస్తున్న భూతంత్రంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి.

- సాక్షి, టాస్క్‌ఫోర్స్

బడుగుల హక్కులకై పోరాడే దివిటీ ఎర్రజెండా... ఇక్కడ స్వప్రయోజనాలే అజెండాగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి భూ మాఫియాగా తయారవుతోంది. దీంతో ప్రజల్లో వామపక్ష పార్టీలపై నమ్మకం సడలు తోంది. రేణిగుంట మండలంలో సీపీఎం నాయకులు వివాదాస్పద స్థలాలను ఎంచుకుని పేదల పేరుతో కొంత మందిని ముందుకుతోసి వారితో బలవంతంగా అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారు. కరకంబాడిలోని సర్వే నంబర్ 153–1లో ఉన్న 40 ఎకరాల వివాదాస్పద భూమిలో పేదల పేరుతో స్థానికేతరులతో భారీగా గుడిసెలు వేయించారు. సుమారు వెయ్యి మందితో ఉద్యమాన్ని మొదలు పెట్టి ఎక్కువ మంది స్థానికేతరులను తీసుకొచ్చి గుడిసెలు వేయించారు. దాదాపు నెల రోజుల పాటు వారిని అక్కడే తిష్ట వేయించి సామాన్యులకు స్థలాల ఆశ చూపి వారి నుంచి కొంత మొత్తం వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. చివరకు పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగించి వారందరినీ గుట్టపై నుంచి కిందకు దింపారు. వారి ఆధార్‌కార్డులను తీసుకొని పరిశీలిస్తే స్థానికేతరులే ఎక్కువగా ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. తారకరామానగర్‌కు చెందిన 900మందికి ఇప్పటికే జగనన్న పట్టాలు పొంది ఉన్నట్లు గుర్తించారు. దీంతో వామపక్ష నాయకులు అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. వాళ్లను నమ్మి గుడిసెలు వేసిన పేదలు తీవ్రంగా నష్టపోయారు.






రేణిగుంట మండలం వినాయకపురంలో భూఆక్రమణ విషయమై సీపీఎం నాయకుడితో స్థానికుల వాగ్వాదం(ఫైల్)

**వినాయకపురంలో..**

రేణిగుంట మండలం వినాయకపురంలో సర్వే నంబరు 831లోని వాగు పోరంబోకు స్థలంలో కొందరి చేత బలవంతంగా అక్రమ నిర్మాణాలను చేయిస్తున్నారు. దాదాపు పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇక్కడ ఇళ్లను నిర్మిస్తున్న వారి నుంచి భారీ మొత్తంలో ఓ సీపీఎం నాయకుడు డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. తమ పంచాయతీలో అక్రమంగా ఇళ్లు నిర్మిస్తూ పెత్తనం చెలాయిస్తున్నావంటూ ఓ సీపీఎం నాయకుడిని తూకివాకం దళివాడకు చెందిన కొందరు రెండు రోజుల కిందట నిలదీశారు. ప్రజల నుంచి రూ.1.10లక్షలు బలవంతంగా వసూలు చేసి కట్టిస్తున్నావు అంటూ ఆరోపిస్తూ... మా పంచాయతీలో మీ పెత్తనం ఏమిటి..? మీ సొంత ఆస్తులుంటే అక్కడకు వెళ్లండని తీవ్ర వాగ్వాదానికి దిగారు.



కరకంబాడిలో స్థానికేతరులచే బలవంతంగా తాత్కాలిక గుడిసెల నిర్మాణం(ఫైల్)

**తారకరామానగర్‌లో..**

రేణిగుంట మండలం తారకరామానగర్లో తిష్టవేసిన మరో వామపక్ష నాయకుడు పేదల ముసుగులో చాలా చోట్ల సొంతంగా ఇళ్లను నిర్మించుకుని ఆస్తులను కూడ బెట్టుకున్నారన్న అభియోగాలున్నాయి. జీపాళెం పంచాయతీ పద్మనగర్‌లోనూ వామపక్ష నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాల్లో సొంతిళ్లు నిర్మించుకున్నట్లు విమర్శలున్నాయి. రేణిగుంట పంచాయతీ సీబీఐడీ కాలనీకి చెందిన ఓ సామాన్య వ్యక్తికి చెందిన స్థలాన్ని ఓ సీపీఎం నాయకుడు దౌర్జన్యంగా ఆక్రమించి ఇంటిని నిర్మించుకున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ పేరుతో ఉన్న ఫోర్జరీ పట్టాను చూపుతూ తనను ఇబ్బందులు పెడుతున్నట్లు బాధితుడు జిల్లా ఉన్నతాధికారులతోపాటు సీపీఎం జిల్లా నాయకులకు కూడా ఫిర్యాదు చేశారు.

# ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల ఏర్పాటు
- నిష్పక్షపాతంగా పనిచేయాలి
- ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

**తిరుపతి క్రైమ్:** ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. గురువారం పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గృహంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ క్రిటికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలను ఎస్‌హెచ్‌ఓలు, ఎస్డీపీఓలు సందర్శించి స్థానికులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలని తెలిపారు. పాత నేరస్తుల కదలికలను గుర్తించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించాలని ఎస్పీ సూచించారు. తగిన సిబ్బందిని నియమించి, నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ రవాణాను అడ్డుకోవాలని అన్నారు. అమాయక ప్రజలను అనవసరంగా ఎన్నికల కేసుల్లో ఇరికించకూడదని తెలిపారు. ఎన్నికల విధుల్లో ఏ అధికారి, పక్షపాతంతో వ్యవహరించకూడదన్నారు. ఎన్నికల నిబంధనల అమలు విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. విధుల్లో ఉన్నప్పుడు వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు, పనులు చేయకూడదన్నారు.

**పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి**

జిల్లాలోని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి, సారా అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. తరచూ ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై హిస్టరీ సీట్లు ఓపెన్ చేయాలన్నారు. మహిళలపై దాడుల నియంత్రణ, లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో ప్రత్యేక ప్రణాళికతో పనిచేసి సఫలమయ్యామని అధికారులను అభినందించారు. అనంతరం నేర నియంత్రణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రశంసించారు. వీఆర్వో విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచినందుకు పోలీస్ పీఆర్‌ఓ చంద్రకు ప్రశంసా పత్రం అందజేశారు. ట్రైనీ ఐపీఎస్ అధికారి దేవరాజ్ మనీష్ పటేల్, ఏఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమల్కుమారి, శివరాం రెడ్డి, రాజేంద్ర, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో నోడల్ అధికారులదే కీలకపాత్ర

**తిరుపతి అర్బన్:** ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులదే కీలకపాత్ర అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాల మేరకు రోజువారీ, వారపు నివేదికలు సక్రమంగా నిర్వహించి, క్రమం తప్పకుండా పంపాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, గడువు లోపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని పనుల ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. మ్యాన్ పవర్ నోడల్ అధికారి, ట్రైనింగ్ నోడల్ అధికారి ఇతర విభాగాల నోడల్ ఆఫీసర్లు సమన్వయంగా పనిచేస్తూ ఎన్నికల విధులను బాధ్యతగా చేపట్టాలని తెలిపారు. త్వరలో జిల్లాకు ఎన్నికల పరిశీలకులు రానున్నారని, వారు రోజు వారీ నివేదికలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎలక్టరల్ రోల్ సరఫరా, బ్యాలెట్ ప్రింటింగ్, వెహికల్స్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, స్ట్రాంగ్ రూమ్‌ల సన్నద్ధతతోపాటు పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాల ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్ర స్థాయిలో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ఎలక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎన్‌ఆర్ రకానికి మంచి రేటు ఇస్తాం

శ్రీకాళహస్తి: వరి వంగడాల్లో ఆర్‌ఎన్‌ఆర్ రకం ధర అయోమయంగా ఉందని పచ్చ పత్రికల్లో ప్రచురితమైన వార్తల్లో నిజం లేదని, మార్కెట్ ధర కంటే మంచి రేటు ఇస్తామని ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉందన్నారు. తెగుళ్లు లేకపోవడం, చక్కెర శాతం తక్కువగా ఉండడంతో ఈ వంగడానికి అత్యధిక డిమాండ్ ఏర్పడిందని తెలిపారు. గతంలో ఏపీసీడ్స్ కిలో రూ.25.50 ఇచ్చి కొనుగోలు చేసిందన్నారు. 20వేల బస్తాలు కావాలని ఏపీసీడ్స్ ఆర్డర్ ఉండగా, 5వేల బస్తాలను మాత్రమే రైతుల నుంచి సేకరించామని తెలిపారు. మార్కెట్‌లో కిలో రూ.29 వరకు పలికిన కారణంగా ఎక్కువ మంది బయటే విక్రయించారని చెప్పారు. కానీ ఈ సారి ఒక్కసారిగా రూ.18కి ధర పడిపోవడంతో ఎక్కువమంది ఏపీసీడ్స్‌కు అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గతంలో కంటే ఈ సారి ఎక్కువ ధర ఇచ్చే అవకాశం ఉందని, ఈ సారి 10వేల బస్తాలు కొనుగోలు చేసేందుకు ఏపీసీడ్స్ సిద్ధంగా ఉందని తెలిపారు.



# వజ్రాయుధం..వదులుకోవద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి




రాయలవారి కోటలో స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ లక్ష్మీశ
- చంద్రగిరిలో ఓటు హక్కు వినియోగంపై అధికారుల బైక్ ర్యాలీ
- రాయలవారికోటలో స్వీప్ కార్యక్రమం

చంద్రగిరి: లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం చంద్రగిరి పట్టణంలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరాదేవి అమ్మవారి ఆలయం నుంచి చంద్రగిరి కోట వరకు ఏర్పాటు చేసిన అవగాహన బైక్ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, ఆర్డీఓ నిషాంత్ రెడ్డి, నియోజకవర్గ తహసీల్దార్లు, ఎంపీడీఓలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, బీఎల్వోలు, పంచాయితీ సెక్రటరీలు, అధికారులు, ప్రజలతో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల పర్వం... దేశానికి గర్వం అని, ఐ ఓట్ ఫర్ ష్యూర్, ఓటు హక్కును వినియోగించుకుందాం... ప్రజా స్వామ్యాన్ని గెలిపిద్దాం అని పలు నినాదాలు చేస్తూ, అందరితో పలికిస్తూ ఉత్తేజపరిచారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీయువకుడు ఓటరుగా తప్పక నమోదు చేసుకోవాలని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ఓటర్లను వారి ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ 612 ఏర్పాటు చేసి, క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించి అర్హులను ఓటరుగా నమోదు చేయించి, వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరుస్తున్నామని తెలిపారు. తిరుపతి కొత్త జిల్లాలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు 2024 అని, ఇందులో ఓటర్ టర్న్ ఔట్ పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఎన్నికల్లో 75 శాతం పైన పోలింగ్ లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన ఫొటో బూత్‌ను కలెక్టర్ ప్రారంభించి, అక్కడ ఫొటో దిగారు. అలాగే చంద్రగిరి కోటను సందర్శించారు.

## ఎట్టెట్టా..!

**వేలిపై సిరా 72 గంటలు చెరిగిపోదు**



'నీ వేలిపై సిరా చుక్క దేశ ప్రగతికి వేగు చుక్క' అంటూ ఎన్నికల సంఘం ఓటు విలువను తెలియజేస్తుంటుంది. ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి వ్యక్తికీ ఎడమచేతి బొటన వేలిపై సిరా చుక్క పెడతారు. చేతి వేళ్లులేని దివ్యాంగులకు కాలి వేళ్లకు సిరా పెడతారు. ఇది ఓటేశామని గుర్తు మాత్రమే కాదు. దొంగ ఓట్లను నిరోధించే ఆయుధం. ఎన్నికలలో వాడే ఇండెలిబుల్ ఇంక్ వేలిపై పెడితే 72 గంటల పాటు చెరిగిపోదు. ఈ సిరాను 1962 నుంచి కర్ణాటకలోని మైసూర్ పెయింట్స్ అండ్ వార్నిష్ కంపెనీ తయారు చేస్తోంది. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆ కంపెనీ నుంచే సిరా సరఫరా అవుతుంది. సిరాలో 7.25 శాతం సిల్వర్ నైట్రేట్ ఉండడంతో ఎక్కువ కాలం చెరిగిపోకుండా ఉంటుంది.

– తిరుపతి సిటీ

# దివ్యాంగులకు హామిల్టన్ చేయూత

- రూ. 15లక్షల విలువైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ


వీల్‌చైర్లు అందుకున్న వారితో హామిల్టన్ పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని గృహోపకరణాల తయారీ పరిశ్రమ హామిల్టన్ ప్రైవేట్ లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్)లో భాగంగా శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగులకు చేయూతనందించింది. రూ.15 లక్షలు విలువైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, ఊత కర్రలు, మరికొన్ని పరికరాలను వితరణగా అందజేశారు. 305 మంది దివ్యాంగులకు వారివారి అవసరాలకు అనుగుణంగా పరికరాలను పంపిణీ చేశారు. గురువారం పరిశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హామిల్టన్ పరిశ్రమ జనరల్ మేనేజర్ జయంతి, ప్రతి నిధులు రాజేష్ గాంధీ, ప్రసన్న, డానేలివాజ్, లారెన్స్, శ్రీసిటీ ప్రతినిధులు రమేష్ కుమార్, వై.రమేష్, సురేంద్ర కుమార్‌ల చేతుల మీదుగా పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీసిటీ ఫౌండేషన్ సహకారం, సూచనల మేరకు ఇంతపెద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ తరహా కార్యక్రమాలు విరివిగా చేపడుతామని పేర్కొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హామిల్టన్ సీఎస్‌ఆర్ కార్యక్రమాన్ని అభినందించారు. దివ్యాంగులకు ఎంతో అవసరమైన పరికరాలను అందించే గొప్ప కార్యక్రమం చేపట్టడం ప్రశంసనీయమన్నారు.

# అభ్యర్థుల లెక్కలు పక్కా

- గణాంకాల్లో షాడోలా మారిన అధికారులు
- అసెంబ్లీకి రూ.39లక్షలు..
- పార్లమెంట్‌కు రూ.90 లక్షలు

తిరుపతి అర్బన్: ఒకప్పటి ఎన్నికలు వేరు..ప్రస్తుతం ఎన్నికల్లో డబ్బు కీలకంగా మారింది. ఎన్నికల్లో పాల్గొనే అభ్యర్థులకు లెక్కలు తప్పనిసరి. ఎన్నికల కమిషన్ రూల్స్ అదేతరహాలో కఠినంగానే ఉన్నాయి. పార్టీలు ఖర్చు చేస్తున్న ప్రతి పైసాకు లెక్కలు కట్టేస్తున్నాయి. షెడ్యూల్ తర్వాత అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ముందు ఖర్చు చేసే మొత్తం ఆ పార్టీ ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. నామినేషన్ల తర్వాత అభ్యర్థి లెక్కలో జమకడతారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.39లక్షలు, పార్లమెంట్‌స్థానానికి పోటీ చేసే అభ్యర్థికి రూ.90 లక్షల మేరకు పెంచినప్పటికీ ఖర్చుపై ఎన్నికల నిఘా పెరుగుతుంది. జిల్లాలో అధికారులు షాడోలా ఉంటూ అభ్యర్థుల ఖర్చులను పైసాతో సహా గణిస్తున్నారు.

**పరిమితికి మించి ఖర్చు చేస్తే..**

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న వారు ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత 30 రోజుల్లోనే పూర్తి స్థాయి ఎన్నికల ఖర్చు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. పూర్తి బిల్లులు సహా అధికారులకు అప్పగించాల్సి ఉంటుంది. పరిమితికి మించి ఖర్చు చేసినా, సరైన సమయంలో లెక్కలు చెప్పకపోయినా వారికి తిప్పలు తప్పవు. వేటు వేయడమే కాదు అవసరమైతే తదుపరి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోయే ప్రమాదమూ లేకపోలేదు.

**క్రమేణ పెరుగుతున్న ఖర్చు..**

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల ఖర్చు క్రమేణా పెరుగుతోంది. 1952లో ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష ఉండేది. 1957లో రూ 2లక్షలు, 1962 నాటికి రూ.3 లక్షలు, 1971కి రూ.4లక్షలు, 1975లో రూ.5 లక్షలు, 1984కి రూ.10లక్షలు, 1991కి రూ.12 లక్షలు, 1999కి రూ.15 లక్షలు, 2004కి రూ.17లక్షలు, 2009కి 26 లక్షలు, 2014 నాటికి రూ.28లక్షలు, 2019లో రూ.30 లక్షలు, 2024కి రూ.40లక్షలకు పెరిగింది.

**నియమావళిని పాటించాలి**

ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనల ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థులు ప్రతి పైసాకు లెక్క చూపాల్సిందే. ఓటర్లను ప్రలోభాలు పెట్టాలని ప్రయత్నం చేస్తే కుదరదు. ఎన్నికల నియమావళి ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. శరవేగంతో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. సమష్టి కృషితో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి చేస్తాం. రాజకీయ పార్టీలన్నీ సహకరించాలి.

–జి.లక్ష్మీశ, జిల్లా ఎన్నికల అధికారి

## ఇండియన్ కలనరీ ఇన్‌స్టిట్యూట్‌లో కొత్త కోర్సులు


మాట్లాడుతున్న ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చెల్లేశ్వరరావు

తిరుపతి కల్చరల్: ఇండియన కలనరీ ఇనిస్టిట్యూట్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలకు దోహదపడే హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఈ ఏడాది బీబీఏ, బీఎస్సీ, ఎంబీఏ కొత్త కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి.చెల్లేశ్వరరావు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంస్థలో ప్రపంచ స్థాయి ఉత్తమ బోధన అందిస్తున్నామని, ఇక్కడ చదివిన వారికి విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి బీబీఏ, బీఎస్సీ కోర్సుల ప్రవేశానికి ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి ఎంబీఏ కలనరీ ఆర్ట్స్ ఏదైనా డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. మే 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. నేషనల్ స్కాలర్ షిప్ సౌలభ్యం ఉంటుందని, నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. www.icitirupati.in వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : మండలంలోని స్వర్ణముఖి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాల వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ కొండప్ప నాయుడు కథనం మేరకు.. నాయుడుపేట–పెదపరియ రైల్వే స్టేషన్‌ల మధ్య పట్టాల మధ్యలో ఓ వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే కీమెన్ రణధీర్‌కుమార్ గుర్తించి నాయుడుపేట రైల్వే స్టేషన్ మేనేజర్ ఏ. సాంబశివరావుకు, ఆయన ఎస్‌ఎం గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ కొండప్ప నాయుడుతో పాటు రైల్వే కానిస్టేబుల్ జయప్రకాష్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. తల, మొండెం వేరుగా పడి ఉండడాన్ని పరిశీలించి, ఆత్మహత్యగా గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, లైట్ బ్లూ కలర్ గళ్ల లుంగీ, సిమెంట్ కలర్ ఫుల్ హ్యాండ్ గళ్ల షర్టు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## త్రీ ఫేజ్ కరెంట్ ఇవ్వడం లేదని నిరసన


నిరసన చేపడుతున్న గుణశేఖర్ నాయుడు

ఏర్పేడు: స్థానిక ఎస్పీడీసీఎల్ సబ్ స్టేషన్ పరిధిలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని రైస్‌మిల్లర్ యజమాని గాలి గుణశేఖర్ నాయుడు గురువారం నిరసన చేపట్టాడు. సబ్ స్టేషన్ వద్ద జరిగిన ఈనిరసనలో ఆయన మాట్లాడుతూ కోబాక గ్రామానికి సమీపంలో తమకు ఓ రైస్ మిల్ ఉందన్నాడు. నెలకు దాదాపు రూ.లక్షకు పైగా కరెంట్ బిల్లు చెల్లిస్తున్నట్లు చెప్పాడు. రెండు రోజులుగా కేవలం 3 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయాడు. స్పందించిన ఏఈ వాసుదేవయ్య సమస్యను పరిష్కరిస్తామని నిరసనను విరమింపజేశారు. సిబ్బందితో రైస్‌మిల్ వద్దకు చేరుకుని విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించి సరఫరా చేశారు. సమాచారం అందుకున్న తిరుపతి డివిజనల్ ఈఈ వాసురెడ్డి సబ్ స్టేషన్‌కు చేరుకుని త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా రికార్డులను పరిశీలించారు. అయన మాట్లాడుతూ త్రీఫేజ్ విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## ఎర్రదుంగలు, రెండు వాహనాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితుడి అరెస్టును చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- ఒక స్మగ్లర్ అరెస్ట్

తిరుపతి మంగళం : మంగళం పరిధిలోని తిమ్మినాయుడు పాలెం సమీపంలో ఆరు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తున్న దోస్త్ లగేజీ వాహనం, మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను అరెస్ట్ చేశారు. డీఎస్పీ చెంచుబాబు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్‌ఐ (రిజర్వు) సురేష్ కుమార్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఐ సురేష్ బాబు బృందం బుధవారం మంగళం, భూపాల్ కాలనీల మీదుగా తిమ్మినాయుడు పాళెం అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. గురువారం బయోట్రిమ్ వద్ద లగేజీ వాహనంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. వాహనాన్ని చుట్టుముట్టగా స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. అందులో ఒక వ్యక్తిని పట్టుకున్నారు. అతన్ని చిత్తూరు రూరల్ తుమ్మిందపాళేనికి చెందిన పవన్ (23)గా గుర్తించారు. ఈ దుంగలను తమిళనాడులోని తిరుత్తణి మీదుగా కర్ణాటక లోని హోస్కోటకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దుంగలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం షాపు గొడవ కేసులో 35 మందికి జైలు

పిచ్చాటూరు: మండలంలోని ఎస్‌ఎస్‌బీ పేట శివారులో 2017 మద్యం షాపు ఏర్పాటుకు సంబంధించిన తలెత్తిన గొడవల కేసులో 35 మందికి మూడేళ్ల పాటు జైలుశిక్ష విధిస్తూ సత్యవేడు కోర్టు గురువారం తీర్పునిచ్చింది. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం.. 2017లో ఎస్‌ఎస్‌బీ పేట గ్రామ శివారులో మద్యం షాపు ఏర్పాటు సమయంలో గొడవలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో బందోబస్తుకు వచ్చిన పోలీసులను సైతం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సంఘటనపై అప్పట్లో పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సత్యవేడు కోర్టులో బుధవారం కేసు తుది విచారణగా న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు రెండేళ్ల జైలుతోపాటు, బాధితులను బెదిరించినందుకు ఏడాది కలిపి మొత్తం మూడేళ్ల జైలుశిక్షను 35 మంది ఎస్‌ఎస్‌బీ పేట గ్రామస్తులకు విధించారు.